క్లుప్తంగా

మహాత్ములకు సముచిత గౌరవం



నేమకల్లు సచివాలయంలో గాంధీ,అంబేడ్కర్ చిత్రపటాలను పైన ఉంచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

చిప్పగిరి: నేమకల్లు గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాల కింద జాతి పిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్ర పటాలు ఉంచడంపై.. సాక్షి దినపత్రికలో మహాత్ములకు అవమానం శీర్షికన రెండు రోజుల క్రితం వార్త ప్రచురితమైంది. స్పందించిన ఈఓపీఆర్డీ బాలన్న శనివారం మహాత్ముల చిత్ర పటాలను పైన ఉంచి గౌరవించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పంటల పరిశీలన



నగరడోణలో కొర్ర పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

చిప్పగిరి: వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శనలో భాగంగా మండలంలోని నగరడోణ, రామదుర్గం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను శనివారం పరిశీలించారు. అధిక దిగుబడులు సాధించడంపై రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్ర, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశర్వర్లు, ఆలూర్ ఏడీఏ సునీత, ఏఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కూర్మనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

మద్దికెర : గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి కోరారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో డ్రైనేజీలపై నిర్మించిన కట్టడాలను కూలగొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కోసం ప్రభుత్వం నిధుల మంజూరు చేసిందని, రోడ్ల వెడల్పు కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు అడ్డంగానున్న బంకులను తొలగించామని చెప్పారు.

ఆలూరు సబ్ రిజిస్ట్రార్‌గా జి.మల్లికార్జున

ఆలూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా జి.మల్లికార్జున నియమితులయ్యారు. ఈయన అనంతపురం జిల్లా కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సుందర మురళీధర్‌రావు పత్తికొండకు బదిలీపై వెళ్లారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన జి.మల్లికార్జునకు కార్యాలయ సిబ్బంది, డ్యాక్యుమెంట్ రైటర్లు సాదరంగా ఆహ్వానం పలికారు.

3 నుంచి దేవి నవరాత్రులు

వెల్దుర్తి(కృష్ణగిరి): దేవి నవరాత్రులను పురస్కరించుకుని వెల్దుర్తి పట్టణ సమీపంలో వెలసిన భువన గాయత్రీ దేవాలయంలో రోజూ ప్రత్యేక పూజలు, యజ్ఞాలు నిర్వహిస్తామని ఆలయ పీఠాధిపతి బాలకృష్ణస్వామి శనివారం తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి ఆలయంలో నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ట్రస్ట్ సభ్యులు జూలకంటి రఘునాథ్‌రెడ్డి, లక్ష్మిసరోజ, సీవీ రమణ, జగదీష్ పాల్గొన్నారు.

రైతులకు సమాచారమివ్వండి

ఆలూరు: వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎరువులు, విత్తనాలు, మందులు, వాతావరణ సమాచారం తదితర అంశాలపై రైతులకు సమాచారం చేరవేయాల్సిన బాధ్యత ఎంపీఈఓలు, వీసీఏఓలపై ఉందని ఆలూరు ఏడీఏ సునీత తెలిపారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో శనివారం ఆమె వివిధ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిత్యం రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుపై సలహాలు సూచనలిస్తూ, మేలైన దిగుబడుల సాధనకు సహకరించాలని చెప్పారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

- ఆలూరు సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే బి.విరూపాక్షి పూజలు
- కర్లకుంట తిరుమలరాయుడు ఆలయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పూజలు

ఆలూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు ప్రశ్నించే అవకాశముందని తిరుమల లడ్డూ కల్తీ అయ్యిందనే అసత్య ప్రచారం చేస్తున్న చంద్రబాబు నాయుడుకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ఆరోపణలు చేసి అపవిత్రం చేస్తున్న చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈరన్న ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా, బెళ్లిగుండా ఆంజనేయస్వామి ఆలయాల్లో పార్టీ నాయకులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి సందర్శించడానికి వెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వారినే ఆలయాల్లోకి రానివ్వకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా చంద్రబాబు వేంకటేశ్వర స్వామి, ప్రజలను క్షమాపణలు కోరి తన పాపాన్ని ప్రక్షాళన చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ ఏరూరు శేఖర్, రంగమ్మ, ఆలూరు,ఆస్పరి చిప్పగిరి ,హాలహర్వి ,హొళగుంద మండలాల పార్టీ కన్వీనర్లు మారయ్య, రామిరెడ్డి, షిఫీఉల్లా, పెద్దయ్య, దేవనకొండ, ఆస్పరి జెడ్పీటీసీలు కిట్టు,దొరబాబు, నాయకులు జనార్ధన్‌నాయుడు ,శేషప్ప,మల్లికార్జున శ్రీను, ప్రభాకర్‌రెడ్డి,హర్షవర్ధన్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, ఎల్లప్ప, గఫూర్,సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, లక్ష్మీదేవి,దివాకర్ నాయకుడు,లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా అధైర్యపడొద్దు..

కూటమి నేతల కుట్రలను తిప్పికొడదామని, ఇందుకు నాయకులు వెనకడుగు వేయాల్సిన భయం లేదని, తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే విరూ పాక్షి పార్టీ శ్రేణులకు భరోసానిచ్చారు. శనివారం ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజలకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన నాయ కులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు

స్వామీ.. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు

కృష్ణగిరి: తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న సీఎం చంద్రబాబునాయుడుకు వేంకటేశ్వరస్వామి మంచి బుద్ధి ప్రసాదించాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. మండలంలోని కర్లకుంట గ్రామంలోని తిరుమలరాయుడు స్వామి దేవాలయంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పవిత్రమైన తిరుమలలో జరగని తప్పు జరిగినట్లు చెప్పడమే కాకుండా, వెనక్కి పంపిన నెయ్యిని శ్రీవారి లడ్డూల తయారీలో వాడినట్లు అసత్య ఆరోపణలతో చంద్రబాబు చేసిన పాపం రాష్ట్ర ప్రజలకు తగలకుండా ఈ పూజలు చేశామన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ హామీలను అమలు చేయలేక చతికిల పడ్డారని విమర్శించారు. హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తారనే భావించి కల్తీ నాటకానికి తెరలేపారని, హిందువుల మనోభావాలు రెచ్చగొట్టాలని కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాలకు స్వామి వారిని, పవిత్ర క్షేత్రాన్ని వాడుకున్న చంద్రబాబుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, లాయర్లు మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, నాయకులు పెద్ద శివన్న, చిన్న శివన్న, వెంకటేశ్వరరెడ్డి, బాలమిన్నెల్ల, నాగేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, మాదవరావు, సుబ్బారెడ్డి, నాగరాజు, ప్రహ్లాద, రంగనాయకులు, జయరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై బాబు విష ప్రచారం

తుగ్గలి : వంద రోజుల కూటమి పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నేర వేర్చడంలో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి లడ్డూపై విష ప్రచారం చేస్తూ డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. బాబు పాప ప్రక్షాళన కోసం శనివారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రభాకరరెడ్డి, రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని, బాబు పాపాలు ప్రజలపై పడకుండా ఉండాలని స్వామిని వేడుకున్నారు. అంతకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, హనుమంతు, గోపాల్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నారాయణనాయక్, టీఎండీ హుసేన్, కమాల్, రఘు, చాంద్‌బాషా, రాజు, గిడ్డయ్య, బీమానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండలో..

సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, మండల అధ్యక్షుడు నాగరాజు, జిల్లా బీసీ సెల్ నాయకులు సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాసు, ఎస్టీ సెల్ నాయకులు భాస్కరనాయక్, సర్పంచ్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తన స్వార్థ రాజకీయాల కోసం తిరుమల పవిత్రత, లడ్డూపై విషం చిమ్ముతూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు.



బసినేపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్ జగన్‌పై కక్షతోనే గతంలో ఎవరూ చేయని కుట్రకు చంద్రబాబు తెరలేపారన్నారు. రాజకీయాల కోసం స్వామి వారి లడ్డూ ప్రసాదంపై బాబు చేస్తున్న దుష్ప్రచారానికి శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్దికెర : వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని, ప్రజలను పక్కదారి పట్టించేందుకు అపవిత్రం అంటూ అసత్య ప్రచారాలు మొదలుపెట్టి అబాసు పాలయ్యారని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మద్దమాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని నాయకులు ఐడీసీ మాజీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు తాలూరి వెంకటేశ్వరరెడ్డి, కృష్ణ, శ్రీనివాసులు, మంజునాథ్‌రెడ్డి, భద్రయ్య, చౌడప్ప, కృష్ణారెడ్డి, దేవంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.



తుగ్గలి చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పత్తికొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కర్లకుంట గ్రామంలోని తిరుమలరాయుడు స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మద్దికెరలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుందాం







దేవనకొండలో మాట్లాడుతున్న తహసీల్దార్ డి.లోకేశ్వరరావు, వెల్దుర్తిలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ , విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

దేవనకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ స్ఫూర్తితో సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని తహసీల్దార్ డి.లోకేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఉచ్చీరప్ప, మాజీ ఎంపీటీసీ నరసారావు, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌శర్మ పేర్కొన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నేటి సమాజ మార్పు–విద్యార్థి పాత్ర అనే అంశంపై సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఆనంద్, రామాంజనేయులు, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని పుప్పాలదొడ్డి, కై రుప్పల, ములుగుందం, బిల్లేకల్లు గ్రామాల్లో శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు రమేష్, రంగప్ప, వీరేష్, బ్రహ్మయ్య, దస్తగిరి, రేవన్న, రఘు తదితరులు భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, మాజీ అధ్యక్షుడు సురేంద్ర భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీరేశప్ప బహుమతులు అందజేశారు.

హొళగుంద: ప్రతి ఒక్కరూ భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ పిలుపునిచ్చారు. శనివారం హొళగుందలో భగత్‌సింగ్ 117వ జయంతిని నిర్వహించారు. వెంకటేష్, తరుణ్, రంజిత్ పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, వైద్యులు బాలచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్ జయంతి కార్యక్రమంలో వారు పాల్గొని తలసేమియా చిన్నారులకు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం ఏర్పాటు చేసిన సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమన్నను అభినందించారు. ఏఎస్ఐ శివరాంరెడ్డి, విద్యానికేతన్ విద్యా సంస్థల చైర్మన్ రమణాచలం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగభూషణం, లెక్చరర్ శ్రీను పాల్గొన్నారు. అలాగే.. వెల్దుర్తిలోని శ్రీసత్యసాయి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి సందర్భంగా కరస్పాండెంట్ జీవీ రమణ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం గఫూర్ పాల్గొన్నారు.

హాలహర్వి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని శనివారం మండలంలోని చింతకుండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గిరిమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం మల్లికార్జునగౌడ్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూపై రాద్ధాంతం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

ఆలూరు: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై రాద్ధాంతానికి అన్ని రాజకీయ పార్టీల స్వస్తి పలకాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లడ్డూ తయారీ లోటుపాట్లపై సీఎం చంద్రబాబు ఇప్పటికే సిట్ విచారణకు ఆదేశించారన్నారు. అందువల్ల ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు వెనుకబడిన ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ జిల్లాల్లో కరువు, కాటకాలతో రైతాంగం అల్లాడుతున్నారని.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీటిని అందించాలని, ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

ఘనంగా సాయిబాబా జయంత్యుత్సవం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

హొళగుంద: మండల కేంద్రంలో శనివారం సాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబా మందిరంలో ఉదయం బాబాకు మహా మంగళారతి, కాకడ హారతి తదితర కర్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి పల్లకీని ఊరేగించారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - 2047 విజన్ ప్రణాళికను సిద్ధం చేయండి

కృష్ణగిరి: స్వర్ణాంధ్ర – 2047 విజన్‌పై మండల ప్రణాళికలను సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి వెంటకలక్షుమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో స్వర్ణాంధ్ర విజన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. విజన్‌పై ఇదివరకే గ్రామస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించామన్నారు. మండలంలో వ్యవసాయ, పశుసంవర్ధక తదితర రంగాల అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఈఓఆర్డీ మురళీమోహన్, ఏఓ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి నవీన్ పాల్గొన్నారు.

రైతులకు సలహాలివ్వండి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర

ఆలూరు: వర్షధారంపై ఆధారపడి పంటలను సాగుచేస్తున్న ఖరీఫ్ రైతులకు పంట దిగుబడులపై రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కృషి విజ్ఞానం కేంద్రం బనవాశి డాట్ కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర ఆదేశించారు. స్థానిక ఎంపీడీ సమావేశ భవనంలో శనివారం ఆలూరు ఏడీఏ సునీత ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆర్ఎస్‌కేల్లో విధులు నిర్వహిస్తున్న అగ్రికల్చర్, హార్టికల్చర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పంట ఉత్పత్తులు పెరిగితే వినియోగదారులకు కొరత ఉండబోదన్నారు. ఉత్పత్తులు తగ్గితే ఆహార దినుసులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ, ఎంఈఓలు వీఏఓలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

చిప్పగిరి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లులో భాగంగా గత ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేసుకోవాలని లబ్ధిదారులకు ఏఈ భవ్య సూచించారు. జగనన్న లే అవుట్ లలో చేపట్టిన గృహ నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఇళ్లకు సంబంధించి 2025 మార్చి వరకే బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

తుగ్గలి : ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ విజయకుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని రాంపల్లి, రామకొండ, ఎద్దులదొడ్డి గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. మండలంలో జగన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చిలోగా కట్టుకోవాలన్నారు.



చిప్పగిరిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హొళగుంద: ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకధికారి నాగేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. శనివారం కడ్లమాగి వద్ద మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుహాసినమ్మ, హౌసింగ్, పీఆర్ ఏఈలు గోపీనాథ్ వర్మ, సోమప్ప పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి

మద్దికెర : జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామని సర్పంచ్ కారుమంచి మల్లికార్జున శనివారం తెలిపారు. జగనన్న కాలనీలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.55 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయిందన్నారు. ట్రయల్ రన్ కూడా చేశామని, త్వరలోనే నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. వెంకటేశ్వరరెడ్డి, కృష్ణ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుగ్గలి : మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు టీడీపీ నాయకులు నాగేంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వరలక్ష్మి, సర్పంచ్ రవి తెలిపారు. ఉపాధి హామీ పథకం, మండల నిధులు రూ.14 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం పారంభించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామ పెద్ద మసీదు కాలనీలో శనివారం సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులకు సర్పంచ్ ఉలిగమ్మ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.10 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. నాయకులు నాగరాజు, దిబ్బలింగ, హనుమంతు, హంపన్న, గోవింద, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

బాధితుడికి దూదేకుల సంఘం చేయూత

హొళగుంద: కూలీ పనులు చేసుకుంటూ రోడ్డు ప్రమాదంలో గాయపడి బళ్లారిలో చికిత్స పొందుతున్న హొళగుందకు చెందిన పింజరి కలందర్‌కు శనివారం హొళగుందకు చెందిన నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు చేయూతనిచ్చారు. కొద్ది రోజుల క్రితం మార్లమడికి రోడ్డులో రెండు మోటర్ బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో కలందర్ కాలు విరిగింది. విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు విరాళాలు సేకరించి రూ.40 వేలు బళ్లారికెళ్లి కలందర్‌ను పరామర్శించి నగదును అందజేశారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన మల్లికార్జుననాయుడు, బ్రహ్మానాయుడు వారి తల్లిదండ్రులు పోలీసునాయుడు, నారాయణమ్మ వర్ధంతి సందర్భంగా మండలంలోని మల్లెపల్లె పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. మొత్తం 130 మంది విద్యార్థులు ప్లేట్లు, గ్లాసులు అందజేసి అన్నదానం చేశారు. వారిని హెచ్‌ఎం విజయకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లార్తిలో పారిశుద్ధ్య పనులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి దర్గా సమీపంలో ఉన్న ముళ్లకంపలు, చెత్తాచెదారాన్ని శనివారం తొలగించారు. దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున దర్గా పరిసరాలను శుభ్రం చేయించారు. ఆదివారం ఉరుసు ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని వారికి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో పనులు చేపట్టినట్లు మల్లికార్జున తెలిపారు.